దిలావర్‌పూర్ బంద్ ప్రశాంతం

- ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఎన్‌హెచ్-61పై రెండు వేల మంది ప్రజలు, రైతుల రాస్తారోకో
- ఫ్యాక్టరీని రద్దు చేసేవరకు ఉద్యమిస్తామని హెచ్చరిక

దిలావర్‌పూర్, జనవరి 4 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని దిలావర్‌పూర్ – గుండంపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజలు, రైతుల పిలుపు మేరకు గురువారం మండలంలో నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఈ మేరకు అన్ని గ్రామాల్లో వ్యాపారులు బంద్ పాటించారు. ఉదయం 9 గంటలకే గుండంపల్లి, దిలావర్‌పూర్, న్యూలోలం గ్రామాలకు చెందిన దాదాపు 2 వేల మంది రైతులు, ప్రజలు జాతీయ రహదారి–61పైకి చేరుకొని టెంటు వేసుకొని బైఠాయించారు. పోలీసుల అనుమతితో రహదారిపైనే సహపంక్తి భోజనాలు చేశారు. దాదాపు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

60 మందిపై కేసు

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ స్థలాన్ని బుధవారం ముట్టడించి.. గోడలు కూల్చివేసి, ఫర్నిచర్ ధ్వంసం చేసి, వాహనాలకు నిప్పు పెట్టిన పలువురు రైతులు, యువకులపై కేసులు నమోదు చేసినట్టు దిలావర్‌పూర్ ఎస్సై యాసీర్ అరాఫత్ తెలిపారు. కంపెనీ ఉద్యోగుల ఫిర్యాదు మేరకు 60 మంది రైతులు, యువకులపై కేసులు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ వద్ద విధులు నిర్వహించడానికి వచ్చిన లోకేశ్వరం మండలానికి చెందిన ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ లక్కపెల్లి జీవన్‌రావు, భైంసాకు చెందిన ఎస్‌బీ కానిస్టేబుల్ జే శంకర్‌రావు సెల్ ఫోన్లు ధ్వంసం చేసిన ఘటనలో ఇంటెలిజెన్స్ పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. కొందరిపై నాన్‌బెయిలబుల్ కేసులు కూడా పెట్టినట్టు తెలిపారు.

ఎన్‌హెచ్-61పై సహపంక్తి వంటావార్పుతో నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

గులియన్‌బేరీకి నిలోఫర్‌లో ఉచిత చికిత్స

- వైరస్ బారిన పడిన వారికి వ్యాధి సోకే చాన్స్
- వ్యాధి ముదిరితే రోగి మరణించే అవకాశం
- ప్రైవేటు దవాఖానలో రోజుకు రూ. 15వేల వరకు ఖర్చు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ): గులియన్‌బేరీ సిండ్రోమ్(జీబీఎస్) వ్యాధి బారిన పడుతున్న చిన్నారులకు నిలోఫర్ వైద్యులు ప్రాణం పోస్తున్నారు. ఎంతో ఖరీదైన ఈ వ్యాధి చికిత్సను ఉచితంగా అందిస్తున్నారు. వైరల్ జ్వరాలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు సోకిన పిల్లలకు జీబీఎస్ వచ్చే అవకాశం ఉంటుందని, ఫలితంగా నాడీ వ్యవస్థ దెబ్బతిని కండ్లు వాలిపోవడం, చేతులు పడిపోవడం, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులొస్తాయని వైద్యులు పేర్కొన్నారు. జీబీఎస్ సోకిన 100 మంది లో ఇద్దరు మృతి చెందే అవకాశం ఉం టుందని తెలిపారు. ఈ వ్యాధికి ఐదు నుంచి వారం పాటు అందించే చికిత్సకు ప్రైవేటు దవాఖానలో రోజుకు రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చవుతుందని చెప్పారు.

లక్ష మందిలో ఒకరికి

గులియన్‌బేరీ సిండ్రోమ్ లక్ష మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధి అని, ఈ వ్యాధి ఎందుకు వస్తుందో కచ్చితంగా చెప్పలేమని నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి చెప్పారు. రోగికి యాంటిబయాటిక్స్ ఇచ్చినప్పుడు వారి శరీరంలోని వ్యాధి నిరోధక శక్తి ఉత్తేజితమవుతుందని, అది వ్యాధితోపాటు రోగి నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుందని, దీనినే 'ఆటో ఇమ్యూనిటీ' అంటారని తెలిపారు. ఈ ఆటో ఇమ్యూనిటీ వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్స్ తగ్గడంతోపాటు నాడీ వ్యవస్థ బలహీనపడి, రోగి నీరసించిపోవడం, నిర్లక్ష్యం చేస్తే కాళ్లు చేతులు పడిపోవడం, శ్వాససమస్య, పక్షవాతం సమస్యలతో పిల్లలు మృతి చెందవచ్చని ఉంటుందని వివరించారు.

నెలకు నాలుగు కేసులు

జీబీఎస్‌కు చికిత్స ఖరీదైనది కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి కేసులు నిలోఫర్‌కు వస్తున్నాయని డాక్టర్ ఉషారాణి చెప్పారు. నెలకు సుమారు నాలుగు కేసులు వస్తున్నాయని తెలిపారు. సకాలంలో బాధితులకు చికిత్స అందిస్తే చిన్నారుల ప్రాణాలు కాపాడవచ్చని, కాళ్లు, చేతులు పడిపోయి, శ్వాస సమ స్య ముదిరిన తరువాత రోగికి చికిత్స అందిస్తే ఫలితం ఉండదన్నా రు. 'నిలోఫర్‌లో జీబీఎస్ బాధితులకు ఇమ్యునోగ్లోబిన్స్' అందిస్తూ చికిత్స చేస్తాం. ఇమనోగ్లోబన్ ఒక వాయిల్ (5 గ్రాముల బాటిల్) రూ.13 వేల నుంచి రూ.15వేల వరకు ఉంటుంది. రోగి బరువు ఆధారంగా డోస్ ఇస్తాము. నిలోఫర్‌లో పైసా ఖర్చులేకుండా సురక్షితమైన వైద్యం అందిస్తున్నాం' అని చెప్పారు.

డాక్టర్ ఉషారాణి

త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామీజీకి పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు

ప్రహ్లాదుడి సంకల్పంతోనే యాదగిరిగుట్ట పునర్నిర్మాణం

- అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి సంపత్‌కుమార స్వామి

యాదగిరిగుట్ట, జనవరి 4 : ప్రహ్లాదుడి మనో సంకల్పం పాలకుల ప్రత్యేక చొరవతో యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణం మహాద్భుతంగా రూపుదిద్దుకున్నదని శ్రీమత్ అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి అన్నారు. గురువారం ఆయన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముఖ మండపంలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

అవిశ్వాసాలకు తెరలేపిన కాంగ్రెస్

- స్థానిక రాజకీయాలకు తెరలేపిన అధికార పార్టీ కాంగ్రెస్
- పార్టీ మారేలా ప్రజాప్రతినిధులపై ఒత్తిడి
- 12 మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు
- లోక్‌సభ ఎన్నికల ముందు పక్కా ప్లాన్

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ స్థానిక రాజకీయాలకు తెరలేపింది. ఇప్పటికే మూడేండ్లు పూర్తిచేసుకున్న మున్సిపాలిటీల్లో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించుకునేందుకు అవిశ్వాసాలకు పురిగొల్పుతున్నది. ఫలితంగా ఇప్పటికే 12 మున్సిపాలిటీల్లో అవిశ్వాస రాజకీయాలు మొదలయ్యాయి. మరికొన్ని అదే దిశగా అడుగులు వేస్తున్నాయి. అవిశ్వాసం పేరుతో రాజకీయ గందరగోళానికి తెరతీసిన అధికార పార్టీ బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లను ప్రలోభపెడుతున్నది. వారిని భయాందోళనకు గురిచేస్తూ అధికార మార్పిడికి ఏర్పాట్లు చేస్తున్నది. పార్టీ మారితే అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీలు ఇస్తూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నది. కాంగ్రెస్ హామీలు, బెదిరింపులకు కొందరు తప్పక తలొగ్గి పార్టీ మారుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 మున్సిపాలిటీల్లో ఇప్పటికే అవిశ్వాసాలు జరుగుతున్నాయి. ఆర్మూర్, నర్సాపూర్‌లో ఇప్పటికే అవిశ్వాసాలు ముగిశాయి. మరికొన్ని చోట్ల అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోపు అవిశ్వాసాలను పూర్తిచేసి మెజారిటీ తమవైపు ఉందన్న అపోహ సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నది. తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో ప్రయోజనం పొందాలని చూస్తున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నా రు. మభ్యపెట్టడం, లేదంటే ప్రలోభం, అదీ పనిచేయకుంటే బెదిరించడం ద్వారా కౌన్సిలర్లను తమవైపు తిప్పుకుంటున్నదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ చేస్తున్న ఈ పనితో ఇప్పటివరకు కలిసిమెలిసి సాగిన మున్సిపాలిటీల్లో రాజకీయ మనస్పర్ధలు చోటుచేసుకుంటున్నాయి. ఈ గందరగోళంతో ఆయా మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులు అటకెక్కుతున్నాయి.

అవిశ్వాసాలు ప్రవేశపెట్టిన మున్సిపాలిటీలు ఇవే

- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, కోదాడ, నేరేడుచర్ల
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో నర్సంపేట
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, నస్పూర్
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్
- ఉమ్మడి మెదక్ జిల్లాలో చేర్యాల, నర్సాపూర్, నారాయణ్‌ఖేడ్

సంక్రాంతి బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం

- నేటినుంచి యథావిధిగా అద్దె బస్సులు
- అద్దెబస్సుల నిర్వహణపై ప్రత్యేక కమిటీ
- టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను ఏర్పాటు చేస్తామని టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళల ఉచిత ప్రయాణానికి అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు. హైదరాబాద్ బస్‌భవన్‌లో అద్దె బస్సుల యజమాన్యాల సంఘంతో టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం గురువారం సమావేశమై చర్చలు జరిపింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ చర్చల అనంతరం అద్దె బస్సుల నిర్వహణపై సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, ఆ సిఫారసులను పరిశీలించాక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో రద్దీ పెరిగి బస్సులు పాడవుతున్నాయని, ప్రమాదాలకు ఆస్కారం ఉన్నదని అద్దె బస్సుల యాజమాన్య సంఘం తెలపడంతో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిపై అద్దె బస్సుల యజమాన్య సంఘం సానుకూలంగా స్పందించిందని, శుక్రవారం నుంచి అద్దె బస్సులు యథావిధిగా నడుస్తాయని ఎండీ వివరించారు. సమావేశంలో ఆర్టీసీ సీవోవో రవీందర్, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

190 కోట్లతో అగ్నిమాపక ప్రతిపాదనలు

- కేంద్ర హోంశాఖకు పంపిన తెలంగాణ అగ్నిమాపకశాఖ
- త్వరలో తుది అనుమతులు: ఫైర్ డీజీ వై నాగిరెడ్డి

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అగ్నిమాపకశాఖకు రావాల్సిన రూ.190 కోట్ల నిధులు, వాటి ఖర్చులకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర హోం శాఖకు పంపినట్టు ఫైర్ డీజీ వై నాగిరెడ్డి గురువారం తెలిపారు. 2020–25 సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.190.14 కోట్లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నది. ఈ మేరకు మనతోపాటు ఆయా రాష్ట్రాలకు చెందిన అగ్నిమాపక విభాగాలను కేంద్ర ప్రతిపాదనలు పంపాలని కోరడంతో తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ వై నాగిరెడ్డి వెంటనే ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో ప్రభుత్వం రాష్ట్రవాటాగా 47.53 కోట్లను విడుదల చేయడంతో మిగిలిన 142.61 కోట్లను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినట్టు ఆయన చెప్పారు. ఈ మేరకు గత డిసెంబర్ 14న ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరైనట్టు తెలిపారు. 2023–24లో రూ. 73.41 కోట్లు, 2024–25లో రూ.66.56 కోట్లు, 2025–26లో రూ.50.17 కోట్లు విడుదలయ్యే అవకాశం ఉందని ఫైర్ డీజీ వెల్లడించారు. మొదటి ఇన్‌స్టాల్‌మెంట్‌లో వచ్చే 73.41 కోట్లను 40 కోట్ల ఖర్చయ్యే 104 మీటర్ల హైడ్రాలిక్ వాహనంతోపాటు ఇతర ఆధునిక వాహనాలను కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు.

- 18 కొత్త అగ్నిమాపక కేంద్రాల నిర్మాణానికి రూ.57.04 కోట్లు
- స్టేట్ ట్రైనింగ్ సెంటర్స్ అండ్ కెపాసిటీ బిల్డింగ్స్‌కు రూ.9.51 కోట్లు
- అధునాతన వాహనాల కొనుగోలుకు అత్యధికంగా రూ.85.57 కోట్లు
- అర్బన్ ఏరియాల్లో అగ్నిమాపక కేంద్రాలను బలోపేతానికి రూ.9.50 కోట్లు
- రాష్ట్ర ప్రత్యేక వినతులు (అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణ, పెండింగ్స్ వర్క్స్) రూ.28.52 కోట్లు

అక్రమాలకు ఎస్సీఆర్ చెక్

- నిరుడు 23.09 కోట్ల గంజాయి పట్టివేత
- 9.35 కోట్ల విలువైన సొత్తు ప్రయాణికులకు అప్పగింత
- దక్షిణ మధ్య రైల్వే వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 4 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే జోనల్ (ఎస్సీఆర్) 2023 పలు అక్రమాలకు చెక్ పెట్టింది. రైల్వే ఆస్తులు, ప్రయాణికుల రక్షణ, భద్రతను కాపాడింది. నిరుడు ఎస్సీఆర్ సాధించిన పలు విజయాలను గురువారం రైల్వే అధికారులు వెల్లడించారు. గతేడాదిలో రైల్వే రిజర్వేషన్ టికెట్లను అనధికారికంగా విక్రయిస్తున్న 261 మందిని అరెస్టు చేసి, రూ.2.30 కోట్లు విలువైనల 8770 టికెట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించే 728 మంది అనుమానిత వ్యక్తులను అరెస్టు చేసి, 10.28 లక్షల జరిమానా విధించినట్టు పేర్కొన్నారు. టికెట్ లేకుండా రిజర్వేషన్ బోగీలో ప్రయాణించిన 702 మంది ప్రయాణికులను గుర్తించామని పేర్కొన్నారు. 23.09 కోట్ల విలువ చేసే గంజాయిని, 3.95 కోట్ల విలువ చేసే బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామని, 28.65 లక్షల విలువైన అక్రమ మద్యం సీసాలను పట్టుకున్నట్టు చెప్పారు. 9.35 కోట్ల విలువ చేసే ప్రయాణికుల వస్తువులను తిరిగి వారే అప్పగించారని తెలిపారు. రైళ్ల ప్రాంగణాల నుంచి 1115 మంది బాలురు, 228 మంది బాలికలను రక్షించి, అప్పగించినట్టు తెలిపారు.

భార్యపై కోపంతో కొడుకును కడతేర్చి

- ఆపై తానూ విషం తాగి అపస్మాకర స్థితిలోకి..

అయిజ, జనవరి 4 : భార్యపై పెంచుకున్న అనుమానం పెనుభూతమై.. అభంశుభం తెలియని రెండేండ్ల చిన్నారి చావుకు కారణమైంది. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో గురువారం వెలుగుచూసింది. శాంతినగర్ సీఐ శివశంకర్ కథనం ప్రకారం.. అయిజ పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో నివాసం ఉం టున్న భార్గవ్‌కు పెంట్లవెల్లికి చెందిన యువతితో 2019లో వివాహమైంది. వారికి కూతురు వనిత, కుమారుడు నందకుమార్ ఉన్నారు. ఏడాది నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు మొదలయ్యాయి. భార్యను అనుమానిస్తూ చిత్రహింసలకు గురిచేసేవాడు. ఇంట్లోనే భార్యను తాళ్లతో కట్టేసి.. బయట ఎవరితో మాట్లాడనీయకుండా కట్టడి చేసేవాడు. దీంతో గత నెల 26న ఆమె తన ఇద్దరు పిల్లలను అక్కడే వదిలి పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావాలని కోరినా భార్య రాకపోవడంతో భార్గవ్.. కోపంతో బుధవారం రాత్రి తన రెండేండ్ల బాలుడు నందకుమార్‌కు విషం తాగించి తానూ తాగాడు. ఉదయం భార్గవ్ తల్లి నందకుమార్‌ను నిద్రలేపే ప్రయత్నం చేసినా లేవలేదు. బాలుడు మృతిచెందగా, అపస్మారక స్థితిలో ఉన్న భార్గవ్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on X @SCRailwayIndia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఓపెన్ ఇ-టెండరు ప్రకటన నం.లు C/E.29/Elec/M/SC/43/PA/OT/ 2022-23 తేది: 02.01.2024

దిగువ ఇవ్వబడిన పని కొరకు **24-01-2024న 15.00 గంటల** వరకు భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు ఇ-టెండరు కోరుతున్నారు.

1. **ఇ-టెండరు నం.** etender No. C/E.29/Elec/M/SC/43/PA/OT/2023-24 etender No. E-M-SC-43-OT-2023-24. **పని పేరు:** సికింద్రాబాద్ డివిజన్–ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్– అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌కు సంబంధించి వివిధ స్టేషన్లు వద్ద ప్యాసింజర్ లిఫ్టులు సరఫరా మరియు స్థాపన (మొత్తం 12 నెం.లు) (ZN, YDD, MDR, PDPL, ZB & BMT స్టేషన్ల వద్ద ఒక్కొక్క దానికి 2 నెం.లు) **టెండరు విలువ:** రూ. 34902134.00, **బయానా:** రూ. 324500.00 **CTF:** రూ. 0.00, **పూర్తి చేయు కాలం:** 9 నెలలు

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, (M), సికింద్రాబాద్

AD011

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి

విజయోత్సవ సంబురాల్లో బీఆర్టీయూ అభ్యర్థి రవీందర్‌రెడ్డి

మిట్టపల్లి ఆర్చ్ ఫార్మాలో బీఆర్టీయూ విజయం

- యూనియన్ అధ్యక్షుడిగా మారెడ్డి రవీందర్‌రెడ్డి గెలుపు

సిద్దిపేట, జనవరి 4 : సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి ఆర్చ్ ఫార్మా కంపెనీలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం బీఆర్టీయూ గెలుపొందింది. బీఆర్టీయూ నుంచి పోటీ చేసిన మారెడ్డి రవీందర్‌రెడ్డి తన సమీప ప్రత్యర్థి బీఎంఎస్ అభ్యర్థి పైవిజయం సాధించారు. గురువారం సాయంత్రం ప్రకటించిన ఫలితాల్లో బీఆర్టీయూ విజయం సాధించడంతో ఆర్చ్ ఫార్మా కంపెనీ వద్ద కార్మికులు పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు. మొత్తం 57 ఓట్లకు గాను 55 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో బీఆర్టీయూ అభ్యర్థి మారెడ్డి రవీందర్‌రెడ్డికి 28 ఓట్లు, బీఎంఎస్ అభ్యర్థికి 27 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు తేడాతో బీఆర్టీయూ అభ్యర్థి విజయం సాధించారు. ఈ సందర్భంగా మారెడ్డి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 13 ఏండ్లుగా ఆర్చ్ ఫార్మా కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో విజయం సాధిస్తున్న బీఎంఎస్ కంచుకోటను బద్దలు కొట్టినట్టు తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ గ్రామంలో రంగాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వేద పండితులు

గుడిలో కొలువైన అర్చకుడు

- రంగాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరించిన వేదపండితులు
- రాముడి సేవలో 52 ఏండ్లు తరించిన పురోహితుడు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 4: 52 ఏండ్ల పాటు రాముడి సేవలో తరించిన అర్చకుడికి గుడి కట్టించి విగ్రహం ఏర్పాటు చేయగా, గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో తాను కాలం చేసే వరకు అర్చకుడిగా, పురోహితుడిగా, వైద్యుడిగా ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించారు సౌమిత్రి రంగాచార్యులు. ఆయన జ్ఞాపకార్థం రాముల వారి ఆలయ సమీపంలో ప్రజల కోరిక మేరకు రంగాచార్యుల కుమారులు కృష్ణమాచార్యులు, రామాచార్యులు ఆలయం నిర్మించి, విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గురువారం వరంగల్ భద్రకాళి ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, హైదరాబాద్‌కు చెందిన వేదపండితుడు కిశోర్ స్వామి, భద్రాచలం ప్రధానార్చకుడు అమరవాది మురళీకృష్ణమాచార్యులు ముఖ్య అతిథులుగా హాజరై రంగాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరించారు. వేదపండితులు మాట్లాడుతూ.. రంగాచార్యులు తన జీవితాన్ని రాముడి సేవకు అంకితం చేసి, పూజలు నిర్వహించి భక్తులను మెప్పించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈయన సేవలను గుర్తించి ప్రభుత్వ భూమిలో ఆలయం నిర్మించడం దేశ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో రంగాచార్యుల సతీమణి కృష్ణకుమారి, కుమారులు సౌమిత్రి కృష్ణమాచార్యులు, రామాచార్యులు, కూతురు వకులమాల, వరుణా చార్యులు, రిటైర్డ్ ఎస్పీ సౌమిత్రి మాధవాచార్యులు, సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ కిడ్నాపింగ్!

- సైబర్ నేరస్థుల కొత్త ఎత్తుగడలు
- కిడ్నాప్ అని ఆన్‌లైన్‌లో డ్రామాలు
- తల్లిదండ్రుల నుంచి డబ్బు వసూలు
- అప్రమత్తంగా ఉండాలి: నిపుణులు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ఇది ఆన్‌లైన్ కిడ్నాపింగ్ గేమ్.. ఇది ఎలా ఉంటుందంటే.. సైబర్ నేరగాళ్లు మీ డాటాను సేకరించి మీ ఫొటోలను మార్ఫింగ్ చేసి మీరు కిడ్నాప్ అయినట్టు మీ పిల్లలకు పంపుతారు. కిడ్నాప్ నుంచి బయటపడాలంటే తనని తానే కిడ్నాప్ చేసుకొనేలా, ఫోన్ వాడకుండా ఉండేలా ఆదేశాలిస్తారు. నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి కిడ్నాప్‌కు గురైనట్టు కొన్ని ఫొటోలు, వీడియోలు తమకు పంపాలని డిమాండ్ చేస్తారు. పిల్లల నుంచి వచ్చిన కిడ్నాప్ ఫొటోలను వారి తల్లిదండ్రులకు పంపి వాళ్లు గేమ్ ఆడుతారు. 'మీ అబ్బాయి లేదా అమ్మాయిని కిడ్నాప్ చేశాం.. పైసలిస్తే వదిలేస్తాం. లేకుంటే చంపేస్తాం..' అని బెదిరింపులకు దిగుతారు. ఇదంతా పిల్లలకు తెలియకుండానే జరుగుతుంది. ఫొటోలు చూసి తల్లిదండ్రులు ఆందోళనతో సైబర్ నేరగాళ్లు అడిగినంత మొత్తం ముట్టజెప్పుతారు. ఇప్పుడిదే సైబర్ నేరగాళ్ల కొత్త పంథా. పైన చెప్పిన కథ అంతా అమెరికాలో తాజాగా జరిగిన ఘటనే. ఇలాంటి ఘటనలు మన దగ్గరా జరిగే అవకాశాలు ఉన్నాయని, పిల్లలపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ సరికొత్త ప్లాన్‌ను సైబర్ నేరగాళ్లు పక్కాగా అమలు చేశారని, పిల్లల ప్రవర్తన, ఫోన్ వాడకం, ఇతర అంశాలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

గేమ్స్ నుంచి డాటా దొంగిలించే అవకాశం

పిల్లలు వాడే ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర గ్యాడ్జెట్స్‌పై తల్లిదండ్రుల నియంత్రణ ఉండాల్సిన రోజులివి. వారికి తెలియని లింక్‌లను ఓపెన్ చేయడం వల్ల మన డాటాను పూర్తిగా సైబర్ నేరగాళ్ల చేతుల్లో పెడతాం. మన పిల్లలు సైబర్ కిడ్నాపర్ల బాధితులు కాకూడదనుకుంటే వారు ఎలాంటి గేమ్స్ అడుతున్నారు? నెట్‌లో ఏం చూస్తున్నారు? ఏం డౌన్‌లోడ్ చేస్తున్నారు? ఎలాంటి విషయాలు చర్చిస్తున్నారు? వారి ప్రవర్తన ఎలా ఉంది? అనే విషయాలపై దృష్టిపెట్టాలి. కొత్త సైబర్ మోసాలపై పిల్లలకు అవగాహన కల్పించాలి.

– అనిల్ రాచమల్ల, సైబర్ నిపుణులు, ఎండ్‌నౌ ఫౌండేషన్

చిన్నారిని చిదిమేసిన స్కూల్ బస్సు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 4: హైదరాబాద్‌లో స్కూల్ బస్సు కింద పడి ఓ చిన్నారి దుర్మరణం చెందింది. ఈ హృదయవిదారక ఘటన ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో గురువారం చోటుచేసుకున్నది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన కేరళకు చెందిన మిథున్ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. సమీపంలోని జాన్సన్ గ్రామర్ స్కూల్‌లో ఒకటో తరగతి చదివే కుమారుడిని ఉదయం బస్సెక్కించేందుకు వచ్చిన మిథున్ డ్రైవర్ వైపునకు వచ్చి మాట్లాడుతున్నాడు. అదే సమయంలో 19 నెలల వయసున్న ఆయన చిన్నారి కూతురు జెవాలన్న అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చి బస్సు ముందు భాగంలో నిలిచి ఉన్నది. గమనించని డ్రైవర్ మహమ్మద్ ఇంతియాజ్ బస్సును ముందుకుపోనీయడంతో చిన్నారి బస్సు కిందపడిపోయింది. వెనుకటైరు పైనుంచి వెళ్లగా అక్కడికక్కడే చిన్నారి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జెవాలన్న

విద్యుత్తు సర్వీస్ చార్జీలు 4.19 లక్షలు

- ఒకేరోజు చెల్లించిన రైతులు
- జగిత్యాల జిల్లా వెల్లుల్లలో 8 ఏండ్లుగా ఇదే ఒరవడి

మెట్‌పల్లి రూరల్, జనవరి 4: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ రైతులందరూ సామూహికంగా ఒకేరోజు 4.19 లక్షల వ్యవసాయ విద్యుత్తు సర్వీస్ చార్జీలు చెల్లించారు. ఈ గ్రామ రైతులు ఎనిమిదేండ్లుగా విద్యుత్తు బిల్లుల చెల్లింపులో ఇదే ఒరవడి కొనసాగిస్తూ ఇతర గ్రామాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గురువారం స్థానిక ట్రాన్స్‌ఫార్మర్ కమిటీ ఆధ్వర్యంలో రైతులు ప్రత్యేక సమావేశమై వ్యవసాయ పంపుసెట్ల సర్వీస్ చార్జీలు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. 2023 సంవత్సరానికి 360 చొప్పున 1,165 పంపుసెట్ల విద్యుత్తు సర్వీస్ చార్జి కింద 4,19,400 చెల్లించాలని తీర్మానించారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ, డీఈ తిరుపతి, ఏడీ మనోహర్ ఆధ్వర్యంలో రూరల్ ఏఈ నవీన్‌కు ఆ మొత్తాన్ని చెల్లించారు. ఒకే దఫాలో సర్వీస్ చార్జీలు చెల్లించిన రైతులకు ట్రాన్స్‌కో అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సీతారాం, లైన్‌మెన్ శ్రీధర్, జేఎల్ఎంలు శివ, జలపతి పాల్గొన్నారు.

ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ తొలిగింపు

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్) డైరెక్టర్ రాజమౌళి నియామకాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. డిప్యూటీ డైరెక్టర్‌గా రిటైర్ అయిన ఆయనను గతంలో డైరెక్టర్‌గా నియమించింది.

శ్రీకాళహస్తి ప్రసూనాంబికకు భూరి విరాళం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): ఏపీలోని శ్రీకాళహస్తిలో కొలువైన జ్ఞాన ప్రసూనాంబికాదేవి అమ్మవారికి భక్తులు భూరి విరాళం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రవి, గాయత్రి దంపతులు ముత్యాల ఆభరణాలను కానుకగా అమ్మవారికి పంపారు. అమెరికాలో ఉన్న దంపతులు వారి కుమార్తె పేరిట అందించిన ఈ ఆభరణాల విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. ముత్యాలు పొదిగిన చీర, పాదుకలు హస్తాలు, నాగ పడగ సహిత వడ్డాణం, కిరీటం తదితరాలు ఈ ఆభరణాల్లో ఉన్నాయి. కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.1.51 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.50 వేలను విరాళంగా విజయవాడకు చెందిన భక్తుడు షణ్ముఖ అందజేశారు.

త్రిపుర హైకోర్టు జస్టిస్‌కు నిమ్స్‌లో వైద్య పరీక్షలు

ఖైరతాబాద్, జనవరి 4: నిమ్స్ దవాఖానలో త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి టీ అమర్‌నాథ్ గౌడ్ గురువారం సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్డియాలజీ విభాగం వైద్యుడు డాక్టర్ సాయిసతీశ్, జనరల్ మెడిసిన్ వైద్యులు నాగేశ్వర్‌రావు, శెల్లి, పల్మనాలజీ స్పెషలిస్ట్ పరంజ్యోతి పర్యవేక్షణలో వైద్య పరీక్షలు జరిగాయి. అనంతరం డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పను జస్టిస్ కలిసి నిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. పేద వారికి అందిస్తున్న వైద్యంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నడకదారిలో కంచెకు 6 నెలల సమయం

- టీటీడీ తరపు లాయర్ వెల్లడి
- తిరుమల నడకమార్గంలో ఫెన్సింగ్ పిల్‌పై ఏపీ హైకోర్టులో విచారణ
- కీలక ఆదేశాలిచ్చిన ధర్మాసనం

హైదరాబాద్, జనవరి 4 (నమస్తే తెలంగాణ): వన్యమృగాల దాడుల నుంచి భక్తులను కాపాడేందుకు తిరుపతిలోని అలిపిరి నుంచి తిరుమల వరకు నడకదారిలో ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, అటవీశాఖ అధికారులను ఆదేశించాలని కోరుతూ బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై ఏపీ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ) ఇచ్చిన నివేదికను కోర్టు ముందు ఉంచామని అటవీశాఖ తరపున ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. ఇనుప కంచె, అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని డబ్ల్యూఐఐ నివేదిక ఇచ్చిందని పిటిషనర్ తరపు లాయర్ తెలిపారు. చిరుత దాడిలో మరణించిన చిన్నారి కుటుంబానికి టీటీడీ తరపున రూ.10 లక్షలు, ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం అందజేశారని టీటీడీ తరపు లాయర్ వెల్లడించారు. డబ్ల్యూఐఐ నివేదిక అమలుకు ఆరు నెలల సమయం పడుతుందని చెప్పారు. భక్తుల భద్రత కోసం టీటీడీ తాత్కాలిక చర్యలు తీసుకున్నదని తెలిపారు. డబ్ల్యూఐఐ ఇచ్చిన నివేదిక ఆధారంగా టీటీడీ కార్యాచరణ ఏమిటని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్ రఘునందన్‌రావుతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. మరోసారి సమావేశమై ఓ నిర్ణయానికి రావాలని స్పష్టంచేసింది. వన్యప్రాణులు స్వేచ్ఛగా తిరిగేందుకు ఎక్కడెక్కడ అండర్‌పాస్‌లు, ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలి.. భక్తుల భద్రత కోసం ఎంతమేర ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్న విషయాలు డబ్ల్యూఐఐ నివేదికలో స్పష్టంగా లేవని అభిప్రాయపడింది. పూర్తి వివరాలు కోర్టు ముందుంచాలని చెప్తూ విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.